www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 20 నవంబర్ 2024

5

కాకినాడ



ఉప్పాడ తీరంలో అలల జోరు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ తీరంలోని బీచ్ రోడ్డుపై అలలు ఎగిసిపడుతున్నాయి. ఈనెల 23వ తేదీ నుంచి బంగాళా ఖాతంలో తుపాన్ ఏర్పడి అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం ఉప్పాడ తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసి పడటంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అల లెగిసిపడుతుండడంతో బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్లు రోడ్డుపైకి చేరుతున్నాయి. సముద్రపు అలల కారణంగా రంగంపేట కాలనీలోకి సముద్రపు నీరు చేరుతుంది.

ఉప్పాడలో ఎగసి పడుతున్న అలలు

కష్టాల కడలిలో 104 సిబ్బంది

- పిఎఫ్, ఇఎస్ఐ సొమ్మును గుంజుతున్న 'అరబిందో '
- అరకొర వేతనాలతో భారంగా కుటుంబ పోషణ
- సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట

వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

104 సేవలు అందిస్తున్న సిబ్బందిపై అరబిందో యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కోసం తన వాటా సొమ్మును యాజమాన్యం చెల్లించాల్సి ఉన్నా అవి కూడా ఉద్యోగుల వేతనాల నుంచే కోత విధిస్తోండటం విశేషం. ఈ నేపథ్యంలో యాజమాన్యం నిరంకుశ వైఖరిలో మార్పు రావాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర సమస్యల పరిష్కారం కోసం 104 సిబ్బంది ఆందోళన బాట పట్టారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 వాహనాలు ఉండగా అందులో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటరర్లుగా 160 మంది పని చేస్తున్నారు. గతంలో 104 సేవలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. 5 ఏళ్లుగా అరబిందో సంస్థ బాధ్యతలు చూస్తుండడం వల్ల ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. 104 ఉద్యోగులను ఆప్కాస్ చేర్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని 2019 అక్టోబరు 31న గత ముఖ్యమంత్రి జగన్ హామీని ఇచ్చినా అమలు చేయలేదు.

ఆరోగ్య సేవల్లో కీలకంగా వ్యవహరిస్తూ...

పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో 104 వాహనాలు చాలా కీలకంగా పని చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వైద్య సేవలు అందించడంతోపాటు అవసరమయ్యే మందులను ఈ వాహనాల ద్వారానే ఇస్తుండడంతో పేద, మధ్య తరగతి రోగులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. అటువంటి సేవలను మరింతగా విస్తృతం చేసి వాహన సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వలన సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగే ఈ సేవలను మరింత విస్తృతపరచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన బాటలో...

గత ఐదేళ్ళ పాలనలో అనేక కష్టాలు పడిన 104 సిబ్బంది కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయినా ఈ ప్రభుత్వంలోనూ అంతగా స్పందన కనిపించడం లేదని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టారు. ఈనెల 15,16,17వ తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు వినతిపత్రాలు అందించారు. 18,19,20 వ తేదీల్లో మండల స్థాయి ఎంపిపి, ఎంపిటిసిలకు వినతిపత్రాలు ఇస్తున్నారు. 21,22,23 వ తేదీలలో జిల్లా పరిషత్ ఛైర్మన్, జడ్‌పిటిసి సభ్యులకు, 24,25,26 తేదీల్లో ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలకు, 27,28 తేదీల్లో రాష్ట్ర మంత్రులకు, 29,30 తేదీల్లో రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులకు కూడా వినతి పత్రాలు అందించి సమస్యలు పరిష్కరించాలని కోరతామని ఉద్యోగులు తెలిపారు.

ఇవీ డిమాండ్లు

104 సర్వీస్‌లను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా నిర్వహించాలి. ప్రతీ నెల వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టాలి. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇలకు ఉద్యోగ భద్రత కల్పించి జిఒ నెంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. 3 సంవత్సరాల నుంచి యాజమాన్యం నిర్లక్ష్యంగా వెయ్యని ఇంక్రిమెంట్లను ఎరియార్స్ రూపంలో ఇవ్వాలి. డిఎస్ఆర్, ఆర్ఓఆర్ ద్వారా నియమించబడి రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్‌లను వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలి. 74 మంది డ్రైవర్లను ఎప్పటి నుంచి వారికి అర్హత వచ్చిందో నాటి నుంచి స్లాబ్‌ను అమలు చేయాలి. స్లాబ్ అమలు చేస్తాము అని అంగీకరించిన వారికి వేతనాలు యాజమాన్యం నుంచి ఇప్పించాలి. పియఫ్, ఇఎస్ఐను యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు అక్రమంగా వసూలు చేసిన యాజమాన్యం వాటా తమకు ఇప్పించాలి. గతంలో 104లో ఎప్పుడూ కూడా పిఎఫ్, ఇఎస్ఐ వాటాను యాజమాన్యం వాటా యాజమాన్యమే కట్టేవి. జిఒ 4459 ప్రకారం యాజమాన్యం చెల్లించాలి. వాహనాలకు ఫిట్ నెస్ ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయించాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

వెంటనే సమస్యలను పరిష్కరించాలి

104 వైద్య సేవలను ప్రభుత్వం మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలి. సిబ్బంది సమస్యలను తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యలపై శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో ఉధృత పోరాటాలు చేస్తాం.

ఎం. త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి,
ఎపి104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాసంఘాల నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

-ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి అన్నారు. మంగళవారం మండలం లోని పలు పాఠశాలు, కళాశాలలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలుసుకున్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధంగా, ఉపాధ్యాయ సమస్యల మీద అలుపెరగని పోరాటం చేస్తానని అన్నారు. 1998వ సంవత్సరం నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై పోరాటాలు చేసినట్లు చెప్పారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భారాలు లేకుండాను, బోధనేతర పనులు తొలగించే విధంగా కృషి చేస్తానని అన్నారు. కళాశాల రంగంలో ఉన్న జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్థిరీకరణకు సంబంధించి జిఒ 114 అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎయిడెడ్ కళాశాలలో పనిచేసే అన్ ఎయిడెడ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సగం విద్యారంగం ప్రయివేటు వ్యవస్థలోనే నడుస్తూ ఉందని, ఆ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్, మెడికల్ రీయంబర్స్‌మెంట్ వంటి పథకాలు సాధించడానికి శాసనమండలిలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేసి ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి చేస్తున్న తనను ఎంఎల్‌సిగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, తొట్టిపూడి రాజా, బొజ్జ అశోక్, కాకర రవికుమార్ పాల్గొన్నారు.

కౌశల్ పరీక్షను జయప్రదం చేయండి : డిఇఒ

ప్రజాశక్తి - కాకినాడ

కౌశల్ పాఠశాల స్థాయి పరీక్షను జయప్రదం చేయాలని డిఇఒ పి.రమేశ్ పిలుపునిచ్చారు. నవంబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ కౌశల్ ఆన్‌లైన్ నమూనా పరిక్షను నిర్వహించారు. 20వ తేదిన 8వ తరగతి విద్యార్థులకు, 21వ తేదిన 9వ తరగతి విద్యార్థులకు, 22వ తేదిన 10వ తరగతి విద్యార్థులకు కౌశల్ పాఠశాల స్థాయి పరిక్ష ను నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహిస్తున్న 241 పాఠశాల నుంచి 3378 మంది విద్యార్థులు కౌశల్ పరిక్ష కు నమోదు చేసుకున్నారని తెలిపారు.

26వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ వాహన డ్రైవర్లు చేస్తున్న నిరసన దీక్ష మంగళవారం నాటికి 26వ రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం చేస్తున్న దీక్ష శిబిరం వద్ద డ్రైవర్లు పాటలు పాడుతూ తమ నిరసనను వ్యక్తం చేశారు. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ మాట్లాడుతూ బకాయి జీతాల చెల్లింపుపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని అన్నారు. జీతాల నిమిత్తం పంపించిన రూ.30 లక్షలు ఎక్కడ ఆగాయో తెలుసుకుని, సత్వరమే డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో జీతాలు పడేలా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపైనే ఉందన్నారు. ఎప్పటికప్పుడు డ్రైవర్ల జీతాల సమస్యను పరిష్కరించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. పిఎఫ్ అధికారులు సైతం కార్మికులకు రెగ్యులర్‌గా పిఎఫ్ అమౌంట్ పడుతుందా? లేదా? అనేది కూడా పరిశీలించడం లేదన్నారు. 9 నెలలుగా క్లాప్ డ్రైవర్లకు కాంట్రాక్టర్ పిఎఫ్ అమౌంట్‌ను చెల్లించలేదని, దీనిపై పిఎఫ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన నిలదీశారు. తక్షణమే క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి వారు విధులకు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శివశంకర్, గంగాధర్, శివ, రాజు, సూరిబాబు, టి.శ్రీను, రమణ, అప్పన్న, దుర్గబాబు పాల్గొన్నారు.

22న మిడ్డే మీల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

డిఇఒకు వినతపత్రం ఇస్తున్న మిడ్డే మీల్స్ యూనియన్ నాయకులు

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మిడ్డే మీల్స్ వర్కర్స్, అండ్ కంటింజెంట్ వర్కర్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం డిఇఒ పిల్లి రమేష్‌ను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల ఈశ్వరి, నాయకులు చంద్రమళ్ల పద్మ కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, కంటిజెంటెడ్ వర్కర్లకు బకాయి ఉన్న రెండు నెలల బిల్లులు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 23 ఏళ్లుగా తాము విధులు నిర్వర్తిస్తున్నామని, అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా మెనులు మార్పు చేయడం జరుగుతుందని, కాని అందుకు అనుగుణంగా మెను ఛార్జీలను మార్పు చేయడం లేదన్నారు. నెలల తరబడి బిల్లులు వేతనాలు పెండింగ్లో ఉంటే వర్కర్లు వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పెట్టుబడి పెట్టి పిల్లలకు వండి వడ్డిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వర్కర్లను రాజకీయ వేధింపులు గురి చేస్తూ అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. జగ్గంపేట, గండేపల్లి, తుని, కరప మండలాల్లో ప్రజాప్రతినిధులు రూ.3 వేలు జీతం తీసుకునే వర్కర్‌ను మార్పు చేసి ఆయా పార్టీలకు చెందిన వారిని నియమించు కోవడం సిగ్గుచేటన్నారు. అతి తక్కువ వేతనంతో ప్రతిరోజు దాదాపు 7 నుంచి 8 గంటలు పని చేస్తున్నారన్నారు. తమను ఎస్ఎంసిల ద్వారా తొలగించడం తగదన్నారు. స్కూల్లో కంటెంట్ వర్కర్లకు గత 5 నెలలుగా జీతాలు లేవన్నారు. స్కూల్స్‌లో నైట్ వాచ్‌మెన్ అని పెట్టి వారికి 9 నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ నవంబర్ 22న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని, ఈ ధర్నాలో మిడ్డేమీల్స్, కంటిజెంటెడ్ వర్కర్లు, స్కూల్ వాచ్‌మెన్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

1న బాలల కథా రచన పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

బాల మందిరం(మాధవపట్నం), గోదావరి బాలోత్సవం (రాజమహేంద్రవరం) సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి బాలల కథా రచన పోటీలు డిసెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బాలోత్సవం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ, గోదావరి బాలోత్సవం బాధ్యులు ఎం.మల్లికార్జునరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి శోభన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పోటీలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 4వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్వచ్చునని అన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా 9963163136 లేదా 94922 49377 నెంబర్‌లకు ఫోన్ చేసి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విద్యార్థులు రాసిన కథలలో 80 కథలు ఎంపిక చేసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలల కథా సంపుటి -2025 పేరుతో పుస్తక రూపంలో ముద్రించనున్నట్లు వారు తెలిపారు. 2025 జనవరిలో ఈ కథలో పుస్తకం ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 1వ తేదీన రాజమహేంద్రవరం నగరంలోని ఎస్‌కెవిటి.ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్ఎంలు, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను ప్రోత్సహించి, ఈ పోటీలో పాల్గొనేందుకు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బిల్లులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం పూర్తి చేయాలని యుటిఎఫ్ నాయకులు ఎంపిడిఒ చిన్నారావును కోరారు. మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సూరిబాబు, కోశాధికారి ఎ.సీతారామరాజు అందజేసి మాట్లాడారు. ఎంఇఒ ప్రసాద్ రెండు నెలల క్రితం సస్పెండ్ అయిన నాటి నుంచి ఇప్పటివరకూ ఒక జీతం తప్ప ఇంక్రిమెంటులు, ఎరియర్ బిల్లులు, మెడికల్ బిల్లులు చేయడం జరగలేదన్నారు. సంఘం తరపున సమస్యను ప్రస్తుత ఎంఇఒ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామని, అయినా నేటికి సమస్య పరిష్కారం కాలేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు పి.శ్రీనివాస్, డి.ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు కెవి.రమణ, వి.పాములయ్య, ఎంవి.సత్య నారాయణ పాల్గొన్నారు.

నచ్చిన మిల్లుకు ధాన్యం తోలుకోవచ్చు: జెసి

ప్రజాశక్తి - సామర్లకోట

రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకునే వెసులుబాటు ఉందని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా చెప్పారు. మంగళవారం మండలంలోని వేట్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు, పొలాల్లో రైతులు అరబెట్టుకున్న ధాన్యం కళ్ళాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకానికి రూ.2300/-, గ్రేడ్ ఏ రకానికి రూ.2320/- గా నిర్ణయించిందన్నారు. ధాన్యాన్ని తరలించే ముందు రైతులు ఖచ్చితంగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి ఉండేలా సరి చూసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన రాండమ్ మిల్ జనరేషన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని, రైతులు ఇకపై తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చునని అన్నారు. ఈ ఏడాది కొత్తగా వాట్సాప్ నందు ధాన్యం కొనుగోలు కూపన్ కొరకు దరఖాస్తు చేసుకోనే వెసులుబాటు కల్పించిందని, రైతు తన మొబైల్ నుంచి 7337359375 నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే తను ఎంచుకున్న సమయానికి కూపన్ షెడ్యూల్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండి నాయక్, తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్, విఎఎలు పాల్గొన్నారు.

ఇంద్రపాలెంను కార్పొరేషన్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఇంద్రపాలెం గ్రామాన్ని తక్షణమే కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని సిపియం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఎం.శివప్రాసద్‌ను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని తక్షణమే కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయడం తప్ప వేరే మార్గం లేదని చెప్పారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కుక్కలు, పందులు బెడదను నివారించాలని, పరిశుధ్యాన్ని మెరుగు పరిచి చెత్తసేకరణను రోజు విడిచి రోజు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి చంద్రరావు, చింతపల్లి వెంకటరమణ, చిట్టూరి విజయ్‌కుమార్, పేరూరి నాగదేవి, శ్రీనివాస్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, మంజన్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కృషితో పంచాయతీలకు నిధులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పాలకవర్గాలు లేని 6 పంచాయతీలకు ఎంఎల్ఎ పంతం నానాజీ కృషితో స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల అయ్యాయని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం రమణయ్యపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని నిస్సహాయ స్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. వెంటనే ఆయన స్పందించి జిల్లా రిజిస్ట్రార్‌తో మాట్లాడటమే కాకుండా, ఇదే అంశాన్ని అసెంబ్లీలో సైతం లేవనెత్తారని అన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేయగా, కూటమి ప్రభుత్వం రాకతో నిధులు విడుదల ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృత్యువాత

ప్రజాశక్తి - సామర్లకోట

వీధి కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన సామర్లకోటలో మంగళవారం చోటుచేసుకుంది. సామర్లకోట లారీ యూనియన్ ఆఫీస్ వద్ద గల రైతు పుట్టా వీర్రాజు మకాంలో 6 రోజుల క్రితం లేగదూడ పుట్టింది. సోమవారం అర్థరాత్రి సమయంలో సుమారు 15 నుంచి 20 కుక్కలు ఒక్కసారిగా లేగ దూడపై దాడి చేయడంతో మృతి చెందింది. ఇటీవల 8 రోజుల వయసు కల్గిన దూడను ఇదే రీతిలో కుక్కఉ దాడి చేయడంతో మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల వలన రోడ్డు వెంబడి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు వీర్రాజు కోరారు.

ఉపాధి నిధుల అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులలో అవకతవకులు జరిగినట్టు ఉప్పలంక సర్పంచ్ బొమ్మిడి నయోమి ఎంపిడిఒ అనుపమకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2009 వరకూ జరిగిన పనులకు గాను అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపి సొమ్మును రికవరీ చేయాలని కోరినట్లు తెలిపారు.

కార్టూ'నిజం'



మరుగుదొడ్డిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

ప్రపంచ టాయిలెట్ డే కార్యక్రమాన్ని జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించారు. సదస్సులు, అవగాహన ర్యాలీలు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న కలెక్టర్

కాకినాడ జిల్లాలో ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని నిర్మించుకుని వినియోగించుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కోరారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే పురస్కరించి కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం, డిస్ట్రిక్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు కలెక్టర్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో తొలుత వ్యక్తిగత పరిశుభ్రత, టాయిలెట్ వినియోగంపై ప్రచురించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే పారిశుధ్య సేవలు అందిస్తున్న క్లాప్ మిత్రలను కలెక్టర్ సత్కరించారు. జిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన వల్ల తాగునీటి వనరులు కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్డి గ్రామాల్లో మహిళల ఆత్మ గౌరవాన్ని కాపడటంతో పాటు, కలుషిత నీటి వల్ల ప్రబలే అనారోగ్యాలకు అడ్డుకట్ట వేస్తుందన్నారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించు కోవలసిన 2,822 కుటుంబాలకు వాటిని మంజూరు చేస్తా మని, ఆయా కుటుంబాలు మరుగుదొడ్లను సత్వరం నిర్మిం చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎం.భారతి, డ్వామా పీడీ పి.వెంకటలక్ష్మి, డిపిఒ వి.రవి కుమార్, డిఎంంహెచ్ఓ జె.నరశింహనాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** ఉత్తమ సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులను ఎంపిడిఒ కె.సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఆయా పాఠ శాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి విజెవి.రమణ, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొ న్నారు. **సామర్లకోట** మండలంలోని ఉండూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు మరుగుదొడ్లపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హిమా మహేశ్వరి, ఇఒపిఆర్‌డి భైరవ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి బులియ్య కాపు పాల్గొన్నారు. అలాగే స్థానిక 'బచ్చు' ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఆయా దగ్గు సూర్యవతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** మండలంలో ధర్మవరం పంచాయతీలో పారిశుధ్య కార్మికులను ఎంపిడిఒ ఎంవి ఆర్.కుమార్‌బాబు సత్కరించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఇడి శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ బి.సుశీల, కార్యదర్శి బి.కామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ జిఎస్.లక్ష్మి పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంపిడిఒ నాతి బుజ్జి పారిశుధ్యం, డ్రెయినేజీ, మరుగుదొడ్ల నిర్వాహణపై వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు బి.రాంబాబు, బి.అప్పలరాజు, కె.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితోనే మహిళా సాధికారిత

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని, మహిళా దినోత్సవాన్నినిర్వహించారు. అలాగే వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ ఐడియల్ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో చేంజింగ్ రోల్ ఆఫ్ లైబ్రరీస్ ఇన్ టెక్నాలజికల్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి మాట్లాడుతూ గ్రంథాలయాలు నిశ్శబ్ద విప్లవమని, మానవ అభివృద్ధికి దేశ ప్రగతికి మార్గదర్శకాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సెక్రటరీ వివిఎల్ఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ ఒక మంచి పుస్తకాన్ని ఎంపిక చేసుకుని పఠనం అలవాటు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రరియన్ చింతపల్లి సుబ్బారావు, రిటైర్డ్ టీచర్ మాకినీడి సూర్య భాస్కర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహు మతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్వీటన్ రాజు, వి.నాగేశ్వరరావు, ఎస్.దుర్గారావు, వైబర్ ఎల్.చౌదరి, విశ్వనాథరాజు, పి గోపి పాల్గొన్నారు. పెద్దాపురం ఆర్థికాభివృద్ధి ద్వారానే మహిళా సాధికారత సాధ్యమని ఎంపిడిఒ శ్రీలత, మహారాణి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జోత్స్న అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవ సభ ఉపాధ్యాయురాలు

కాకినాడలో మాట్లాడుతున్న డాక్టర్ పి చిరంజీవిని కుమారి

మిరియాల జయశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చదువుకోవటం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ఈ సభలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు. యు.కొత్తపల్లి ఉప్పాడ గ్రంథాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గ్రంథాలయ అధికారి టి.నరసింహ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. సామర్లకోట స్థానిక గ్రంథాలయ అధికారి బందిల రత్నమణి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రాజారాజేశ్వరిల పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పరిధిలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా విశ్రాంత ఉపాధ్యాయులు ఎండివి.ప్రసాద్, టివివి.సత్యనారాయణ, పి.బ్రహ్మానందం వ్యవహరించారు. గండేపల్లి ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, గ్రంథాలయ అధికారి కె.అశోక్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. పిఠాపురం స్థానిక శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ వై.జ్యోతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరమణ, బివిఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.సత్యప్రియ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. గొల్లప్రోలు స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎండిఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ రెడ్డి వీర్రాజు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి నల్లబిల్లి అపర్ణ, మెప్మా యానిమేటర్ లక్ష్మీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, సభ్యులు మలిరెడ్డి నారాయణరావు, కొమ్ము సత్యనారాయణ, కొశిరెడ్డి త్రిమూర్తులు, పాఠకులు పాల్గొన్నారు.

అపరిచిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి - కాకినాడ

అపరిచిత ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ సూచించారు. మంగళవారం జెఎన్‌టి యుకె ప్రాంగణంలో అలూమ్ని ఆడిటో రియంలో జెఎన్‌టియుకె, యునికెరె ఎన్ఎస్ఎస్ యూనిట్లు, జిల్లా పోలీసు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అధ్యాపకులకు, సిబ్బందికి, విద్యార్థులకు 'సైబర్ భద్రత'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, యువత తమ స్మార్ట్ ఫోన్లకు వచ్చే అనుమానాస్పద లింక్‌లను తెరవకుండా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ ద్వారా తమ బ్యాంకు ఖాతాలలో డబ్బులను పోగొట్టుకున్న ట్లయితే నిర్దిష్ట సమయంలో 1930 టోల్ ఫ్రీ నెంబరు ఫిర్యాదు చేయా

సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి

లన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకుని ఇతరులు సైబర్ మోసాలకు గురికాకుండా చూడాలన్నారు. మన దేశంలో 90శాతం మంది స్మార్ట్ ఫోన్లను వినియోగిస్తున్నారని, స్మార్ట్ ఫోన్లను వినియోగించేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుత తరుణంలో డిజిటల్ అరెస్ట్, స్టాక్ మార్కెట్, ఉద్యోగ మోసాలు, కెవైసి మోసాల పేర్లతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, వీటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రఘువీర్ విష్ణు, సైబర్ సెల్ సిఐ, ఇన్స్‌స్ట్రక్టర్ ఛార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఎస్ చక్రవర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ పిఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు, టిడిపి నాయకులు

ఎంఎల్ఎ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - తొండంగి

మండలంలోని మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించినందుకు మత్స్య కారులు ఎంఎల్ఎ యనమల దివ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం కొత్త పెరుమాళ్ళపురం పంచాయతీ ఆర్ మత్స్యకార గ్రామాల ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఆయా గ్రామాల నాయకులు, చొక్కా మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చొక్కా అప్పారావు, నాయకులు గంటా లక్ష్మణ్, గరికిన రాజుబాబు, పిక్కి శ్రీరామ్, గరికిన లోవరాజు, గంటా జగదీశ్, గంటా దేవుడు, గరికిన నల్లబ్బాయి, అర్జిల్లి గాలిరాజు, కంబాల స్వామి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పెద్దాపురం యువతకు మెడల్స్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలవు సూర్యారావు భవనంలో కరాటేలో శిక్షణ పొందుతున్న సహస్ర, యోగేష్ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. విశాఖ పట్నంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కట్టా, కుంటే విభాగాల్లో సహస్ర బంగారు పతకాలు సాధించగా, లోకేష్ కుంటే

బహుమతులతో విజేతలు

విభాగంలో రజత పతకం, కాటా విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ పతకాలు సాధించిన సహస్ర, యోగేష్‌లను కరాటే గురువు దుంగల పుజుకా సూర్యశ్రీ, చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ అభినందించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక పంచాయతీ పరిధిలో భైరవ స్వామి గుడికి సంబంధించిన రెండు ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు సర్పంచ్ బొమ్మిడి నరేమ తాహసీల్దార్ ఎన్.సత్యనారాయణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాల భైరవ స్వామి గుడికి కార్యకలాపాలు నిర్వహించేందుకు కాలేపు ఆనందరావు సర్వే నెంబర్ 106/1ఎలో రెండు ఎకరాల భూమిని గుడికి దానం చేయుట జరిగిందని, నేడు ఆ భూమిని కొందరు ఆక్రమించి వేసి భవనాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకుని దేవుని భూమిని కాపాడాలని కోరారు.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలకు చేరువలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి సేవలు అందించి, ఆసుపత్రి ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని కలెక్టర్ షాన్ మోహన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సి లలో ప్రజలకు అందిస్తున్న సేవలు, నిర్దేశిత లక్ష్యాల సాధన అంశాలపై సమీక్షించారు. గత ఆరుమాసాల కాలంలో జిల్లాలోని 44 పిహెచ్‌సిలు, 23 యుపిహెచ్‌సిలలో కేవలం 400 ప్రసవాలు నిర్వహించడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన ప్రతి ప్రసూతి కేసును ఏరియా, జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేయడం సరికాదని, సురక్షితమైన కేసులన్నిం టినీ సిహెచ్‌సి, పిహెచ్‌సిలలోనే నిర్వహించా లని సూచించారు. ప్రతి పిహెచ్‌సిలో నెలకు కనీసం 15 ప్రసవాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పిహెచ్‌సి వైద్యాధికారులు తమ కేంద్రం పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

చదువుతున్న యుక్తవయస్సు బాలికలలో రక్తహీనతను గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ కాన్సర్ కేసులను, తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు చేపట్టిన ఎన్‌సిడి 3.0 సర్వే కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహిం చాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ పథకం క్రింద 70 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న 5 లక్షలల వరకూ ఉచిత ఆరోగ్య బీమా కొరకు జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరినీ నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ జె.నరసింహ నాయక్, అడిషనల్ డిఎంహెచ్‌ఒలు, పిహెచ్‌సి, సిహెచ్‌సిల వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేరాల అదుపుపై దృష్టి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీహరిరాజు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు, డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి డి.శ్రీహరి రాజు సూచించారు. మంగళవారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్, కార్ స్టాండ్ ఆవరణలో డ్రైవర్లకు, ప్రజలకు, ప్రయాణీకులకు నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు నిరోధించాలని, నేరాలు జరగకుండా డ్రైవర్ల పాత్రను వివరించారు. ఆటోల్లో, కార్లల్లో ప్రయాణించే ప్రయాణీకులు అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే సిసి కెమెరా పర్యవేక్షణలో నేరాలు కనిపెట్టడంతో, ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియచేయడంతో వ్యాపారులు, సంస్థలు సహకరించాలన్నారు. డ్రైవర్లు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండి నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణ భగవాన్, సిసిఎస్ సిఐ అంకబాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ నుంచి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు

జిల్లాలో పలు మండలాల్లో పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం

రబీ నుంచి కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ జరుగుతుందని వ్యవసాయ శాఖ ఎడిఎ నల్లి దైవకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని సిరివాడ, తిమ్మేశ్వరం రైతు సేవా కేంద్రాల వద్ద నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర వస్తుందన్నారు. వచ్చే దాళ్వా సీజన్‌లో రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తారన్నారు. అలాగే నూతన కౌలు చట్టంపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి సుజాత మాట్లాడుతూ జీడి మామిడి రైతులు ఎకరానికి రూ.1500 చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. జీడి మామిడి, జామ, బొప్పాయి సాగు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయి తీలను వివరించారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశుగణన సర్వేకు రైతులందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌వివి.ప్రసాద్, బి రాగ ప్రవంతి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ గ్రామ రైతు సేవ కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎం.సుధారాణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ పాల్గొని మాట్లాడారు. పత్తి పంటకి పింక్ నల్లి ఆశించడంపై రైతులు అందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింక్ నల్లి నివారణకు ఎసిఫేట్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో గాని, ప్రొఫెనోఫాజ్ మూడు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటితో కలిపి ఎకరాకు 200 మీటర్ల మందు ద్రావణాన్ని సర్గాని, టీ పాలు గాని స్ప్రేయర్ కి 50 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.సాక్ష, మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. గండేపల్లి మండలంలోని యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది రబీ పంటకి సంబంధించి ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని, పంట బీమా ప్రతి రైతు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ చంద్రమౌళి, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిమిలంకలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు గాయపడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లలమామిడాడకు చెందిన యు.అనుకుమార్, యు.అభిషేక్, ఎ.సురేష్ కోత మిషన్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. వీరు మలిపిపల్లం నుంచి మంగళవారం తెల్లవారుజామున గొల్లల మామిడాడ వెళుతున్నారు. ఈ సమయంలో ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నడిమిలంక సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనుకుమార్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన అభిషేక్, సురేష్ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ జి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ

భర్త మృతి, భార్యకు గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారి పక్కనే ఆగి ఉన్న మోటార్ సైకిల్ ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ శివనాగ బాబు తెలిపిన వివరాల ప్రకారం...కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన వల్ల వెంకటరమణ అతని భార్య లక్ష్మీ కలిసి మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తూ మండలంలోని మురారి గ్రామ శివారుకు ఆగారు. అదే సమయంలో లారీ వేగంగా వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ(53) తలకు బలమైన గాయ కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. అతని భార్య గాయాలతో బయటపడిందని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

30 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి రహదారిలో ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యాన్ని తరలిస్తున్న కాలా శ్రీనివాసును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 30 మద్యం సీసాలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ. నాగేంద్ర కృష్ణ తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. కొత్తూరు గ్రామానికి చెందిన వి.దుర్గయ్య నాటు సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశామని, ఈ దాడిలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన 16 మంది అరెస్ట్

ప్రజాశక్తి - తుని

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన 16 మందిపై కేసులను నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ ఎన్.విజయ్ బాబు తెలిపారు. మంగళవారం తుని రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్ మీడియా ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ప్రభుత్వ పెద్దలను, వారి మనోభావాలను దెబ్బతీస్తూ పార్టీల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన తుని పట్టణం, తుని రూరల్ పరిధిలో ఉన్న చింతమనేని గణేష్, కాకినాడ గణేష్, నాగం దొరబాబు, అడపా సురేష్, ఎ.గణేష్ వీరవెంకటరమణ, చింతకాయల చినబాబు, బండారు బ్రహ్మానాయుడు, షేక్ ఖ్వాజా, ఏలూరు బాలు, ఎలిగిరెడ్డి జార్జ్ కిరణ్, తుపరను సాయి, మగటాల నాగ శ్రీను, దిబ్బ శ్రీను, పెనుగొండ వెంకటరమణ, కొరుప్రోలు లలితలపై కేసులు నమోదు చేసి కోంతమందిని కోర్టుకు తరలించడం జరిగిందన్నారు. వీరిలో కొంతమందికి బెయిల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మరి కొంతమందిని ఐడెంటిఫై చేసి వారిని కూడా అరెస్ట్ చేస్తామని చెప్పారు. యువకులు సోషల్ మీడియా ద్వారా వేరువేరు గ్రూపుల్లో వచ్చిన పోస్టులను మరొక గ్రూపులో షేర్ చేసే వారిపైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఏడుగురిపై డ్రంక్ డ్రైవ్ కేసులు

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యం సేవించి వాహనం నడిపుతున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఉప్పాడ బస్‌స్టాండ్ సెంటర్, పాదగయ జంక్షన్‌లో పిఠాపురం పట్టణ, గ్రామీణ, గొల్లప్రోలు, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కలిసి ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు సరిగ్గా ఉన్నాయా, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు చట్టాలపై పలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రఘువీర్ విష్ణు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపిన, నిబంధనలు పాటించకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు మణికుమార్, గుణశేఖర్, రామకృష్ణ, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

13 మందికి జరిమానా, ముగ్గురికి జైలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మద్యం తాగి వాహనం నడుపుతున్న కొందరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు కోరంగి ఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు. సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16 మందిలో 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని ముగ్గురికి 2 రోజులు జైలు శిక్ష విధించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పదిమందికి ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాట్రావులపల్లి నుంచి రామేశంపేట వెళ్లే రహదారిలో పలు ప్రాంతాలను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు.

ట్రినిటి ఆసుపత్రి వద్ద రోగి బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పవర గ్రామంలో ఉన్న ట్రినిటి ఆసుపత్రి వద్ద రోగి బంధువులు ఆందోళనకు దిగారు. ఏలేశ్వరంకు చెందిన క్యాన్సర్ రోగి నల్లమటి చంటమ్మను ఈ నెల 11వ తేదీన ట్రినిటి ఆసు పత్రిలో జాయిన్ చేశారు. 14వ తేదీన ఆపరేషన్ నిమిత్తం వైద్యులు ఓపి చేయగా క్యాన్సర్ ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నట్లు గుర్తించారు. పరిశీల కోసం పంపించారని, అప్పటి వరకూ వైద్య చికిత్స అవసరమని చెప్పడంతో వైద్య సేవలు అందిస్తు న్నారు. ఆమెలో ఎటువంటి పరిస్థితి మార్పు రాకపో యిన నేపథ్యంలో మంగళవారం ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిలర్ కందా లోవరాజు ఆధ్వర్యంలో రోగి బంధువులు ఆందోళనకు దిగారు. రోగికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అడబాల ట్రస్ట్ కార్యాలయంలో విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు ఆర్థిక సాయంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ హీన, దీన జనులందరూ తనవారే అనుకుని సేవ చేయడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం ప్రతీ ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, శ్రీవాణి పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక గోర్స రైల్వే ఆర్ యు బి ట్రాక్‌పై గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందినట్లు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు ఆకుపచ్చ, నలుపు కలగలిసిన హాఫ్ నిక్కర్, బ్లూ, వైట్ గ్రే కలర్ స్ట్రిప్స్ హాఫ్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతునికి గల కారణాలు, ఇతర వివరాలు తెలియరా లేదన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సామర్లకోట రైల్వే పోలీసులను సంప్రదించా లన్నారు. మృతదేహాన్ని పోస్ట్ పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివ ర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నీలిమకు జెఎన్‌టియుకె నుంచి డాక్టరేట్ అంద కున్నారు. ఇఎల్ఎస్ ప్రొఫెసర్ "హైదరాబాద్) ప్రొఫెసర్ డాక్టర్ జి.సువర్ణ లక్ష్మి నేతృత్వంలో 'ఫోస్టరింగ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఇన్ ఇఎస్ఎల్ లెర్నింగ్ ఇన్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్' అనే అంశంపై ఆమె సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారని ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయాలలో 23 సంవత్సరాల అనుభవం కలిగిన నీలిమకు డాక్టరేట్ రావడం పట్ల ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.బి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ నీలిమ

లిబరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో డిసెంబర్ 4న జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండలంలోని బద్రవరం, లింగంపర్తి, ఎర్రవరం, పెద్దనాపల్లి మీదుగా ఏలేశ్వరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బుగతా బంగారురాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను విసుకు చెంది కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలకు నిరాశ మిగిలిం దన్నారు. రైతు, కార్మిక వర్గాలు అనుభవిస్తున్న సమస్యలు పరిష్కరించాలని ప్రజా హక్కుల సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు వి.శంకర్, ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చ బాబు, గొడుగు సత్యనారా యణ, నిరుకొండ నాగేశ్వరరావు, నాగమణి, వి.రత్నం పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్ నుంచి పెద్దాపురం పట్టణానికి వేసిన సిమెంట్ పైపులైన్‌ కు మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిఎస్.ప్రకాశరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లా డుతూ విమల్ ఫ్యాక్టరీ వద్ద మంచినీటి సరఫరా జరిగే పైపులైను పగిలి మంచినీరు వృధాగా పోవడంతో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేపట్టామ న్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గోదావరి మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందన్నారు.

కొనసాగుతున్న రీ సర్వే గ్రామ సభలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పెద్దాపురం

మండలంలోని చేబ్రోలు ప్రీ శక్తి భవన్లో మంగళవారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కె. మస్తానీ అర్జీలను స్వీకరించారు. ఈ కార్య క్రమంలో మండల సర్వేయర్ కేదారేశ్వరరావు, ఆర్ ఐ డి.బాలకృష్ణ, పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలంలోని చిన్నబ్రహ్మదేవం పంచాయతీ వద్ద రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి 41 అర్జీలు వచ్చాయని విఆర్‌ఒ శ్రీనివాసరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి సూచించారు. మంగళవారం మండ లంలోని సి.రాయవరం గ్రామంలో ధాన్యం కల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ ధాన్యం తరలించుకునేందుకు జిపిఎస్ అమర్చిన వాహనాలు ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. మండలంలోని సి.రాయవరం, ఎర్రవరం, సిరిపు రం, పేరవరం, లింగంపర్తి 1, 2, మర్రిపీడు గ్రామాల క్లస్టర్ల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు తమ శాతం 17 కంటే

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జ్యోతి

తక్కువ ఉండేలా ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు. కనీసం మద్దతు ధరగా వంద కేజీలకు సాధారణ రకం రూ.2,300. గ్రేడ్ ఏ రకం రూ.2,320, 75 కేజీలు సాధారణ రకం రూ.1,725, గ్రేడ్ ఏ రకం రూ.1,740గా నిర్ణయించడం జరిగిందన్నారు.

CHANGE OF NAME

I, VEERA VENKATA SIVA NAGA SURESH BAVISETTI, Son of VEERA VENKATA VARA PRASADA RAO BAVISETTI, Resident of D.No. 4-35, Panduru, Kakinada, Andhra Pradesh - 533005 have changed my name from **VEERA VENKATA SIVA NAGA SURESH BAVISETTI** (Old Name) to **SURESH BAVISETTI** (New Name). Henceforth, I shall be known as **SURESH BAVISETTI** for all purposes.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, గండేపల్లి గ్రామానికి చెందిన దుంగల మాధవి రమాదేవి, భర్త: నాగేశ్వరరావు (లేటు), డోర్ నెం. 1-43, గండేపల్లి గ్రామంలో నివసిస్తున్నాను. జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్ నందు నా పేరున రిజిస్టర్ కాబడిన సర్వే నంబర్ 424-1 రిజిస్టర్డ్ దస్తావేజులు ది. 12-11-2024వ తేదీన గండేపల్లి నుండి జగ్గంపేట తీసుకొని వెళ్ళుచుండగా దారిలో పడిపోయినవి. నేను ఎంత వెతికినను నా డాక్యుమెంట్స్ దొరకలేదు. దొరికినవారు ఈక్రింది నెంబరుకు తెలియచేయగలరు.

సెల్: 81068 25807
9494666784

IN THE COURT OF THE AGENT TO GOVERNMENT (DIST.COLLECOTR) AT KOTHAGUDEM.
O.S.NO. 249 OF 2022

Between:
Godla Ramesh .... Plaintiff
Vs.
Kothapally Venkateswara Rao .... Defendant

To,
Kothapally Venkateswara Rao
S/o Raju, Age: 40 yrs, Occ: Agriculture,
R/o Gogubaka Village, Yetapaka Mandal,
East Godavari District.

Whereas the plaintiff has filed the above suit for recovery of money on the file of Agent to Government District Collector at Kothagudem and the suit is posted on 07-12-2024 for appearance of any objections. Hence you are hereby informed to appear before this court on 07-12-2024 at 11:00 A.M either by yourself or through your counsel filing which the matter will be decided ex-parte

'By order of the court
MANTRIPRAGADA RAVI THEJA
Advocate

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.273/2023
In I.P. No.7/2023

Between
పట్నాల ఎస్. వి. ఈశ్వర రావు ... పిటిషనర్ /పిటిషనర్
మరియు
వాకాడ సత్యనారాయణ మరియు ఇతరులు ... రెస్పాండెంట్ /రెస్పాండెంట్స్
R2 వాకాడ సత్యనారాయణ,
S/o.అప్పారావు C/o లేటు నందిని సంతోకరావు గారి ఇల్లు, 43 సం.లు, హిందూ, నిల్ R/o డోర్ నెం. 19-8-1 ప్లాట్ డిజైన్లర్, వీధి, రత్నంపేట, రామచంద్రపురం మరియు మండలం, R.C.P.J.C.J.C.

పై నెంబరు పిటిషన్ నందు R1 రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది. 25-11-2024** వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం 10-30 ని లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కాని ప్లీడరు గారి ద్వారా కాని హాజరు కావలెను. మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పై పరోక్షముగా తీర్మానించబడును అని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల అనుసారం)
కొముజు సూర్యనారాయణ
రామచంద్రపురం
19-11-2024
సెల్ :9849379828

ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 3వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 291/2024, I.A. No. 264/2012,
O.S. No. 16/2010

Between:
పిటిషనరు: యరమాటి వీర రాఘవులు
AND
రెస్పాండెంటు: టి.కృష్ణ, వగైరా

To:
4వ రెస్పాండెంటు: బొద్దు సుబ్బాయమ్మ, W/o. రాజు, డో.నెం. 4-141, రామాలయం వీధి, గండ్రేడు, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలో పైన తెలిపిన 4వ రెస్పాండెంటునకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్నిసార్లు సమనులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా తెలిపినది 4వ రెస్పాండెంటు పై కోర్టు వారి ఎదుట ది. 29-11-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు హాజరయి అభ్యంతరములు ఏవైనా ఉన్నచో తెలుపగలరు. లేని ఎడల మీ పరోక్షముగా తీర్మానించబడునని యిందుమూలంగా తెలియచేయడమైనది.

కాకినాడ
15-11-2024
మెల్ల సూర్యనారాయణ
పల్లంశెట్టి సర్వేశ్వరరావు
అడ్వకేట్స్, కాకినాడ